పార్కింగ్ ఫీజులుం



స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద పార్కింగ్ స్థలంలో వాహనాలు

స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద బాదుడే బాదుడు

ఒకేసారి 10 రెట్ల పెంపు

ప్రయాణికుల గగ్గోలు

లాభాపేక్ష దుర్మార్గం..

ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ షెడ్లపై వ్యాపారం చేయాలని చూడటం దుర్మార్గమని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీది లాభాపేక్షతో చూస్తే ఇక కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు యాజమాన్యం ఇచ్చే ప్రతిఫలం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో కూడా ఇంతింత రేట్లు లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి అధికంగా చేయడం ద్వారా ఆదాయం సంపాదించాల్సిన యాజమాన్యం పార్కింగ్ ఫీజు పెంపు ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని యోచించడాన్ని ప్రయాణికులు అపహాస్యం చేస్తున్నారు.

నిర్వాసితుల పొట్ట కొట్టడం అన్యాయం..

ఇప్పటికే వందలాది మంది నిర్వాసితులు ఉపాధి లేకపోవడంతో అల్లాడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్వాసితులకున్న ఉపాధి లాక్కోవడం అన్యాయమని నిర్వాసిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. టౌన్ అడ్మిన్ చర్యలకు నిరసనగా నిర్వాసిత సంఘాలు ఆందోళనలకు సన్నద్ధం అవుతున్నాయి.



పార్కింగ్ ఫీజు తెలిపే బోర్డు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రయాణికులకు పార్కింగ్ బాదుడు తప్పడంలేదు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పది రెట్లు పెంచిన పార్కింగ్ చార్జీలపై ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. అశాస్త్రీయంగా ఫీజులు పెంచిన ఉక్కు టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు చుట్టు పక్కల ఊళ్ల నుంచి విధులకు హాజరవుతుంటారు. అయితే కూర్మన్నపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు, టౌన్‌షిప్‌కు బస్సుల సదుపాయం అరకొరగా ఉండటంతో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు అదే విధంగా టౌన్‌షిప్‌లో నివసించే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కూర్మన్నపాలెం వరకు వచ్చి అక్కడ రోడ్డు పక్కన వాహనాలు పెట్టి ప్రయాణం చేస్తుండేవారు. ఈ క్రమంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి చూసిన కార్మిక సంఘాల నాయకులు ఆ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ఉచితంగా పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేయమని కోరారు. అప్పటి యాజమాన్యం సామాజిక బాధ్యతగా భావించి కూర్మన్నపాలెం ఆర్చిని ఆనుకుని రెండు పెద్ద పార్కింగ్ షెడ్లు నిర్మించింది. ఉపాధి లభించని నిర్వాసిత వికలాంగులకు నామమాత్రం రుసుంతో షెడ్ల నిర్వహణ అప్పగించారు. ఉపాధి పొందిన లబ్ధిదారులు ప్రయాణికుల నుంచి 12 గంటలకు రూ. 1, 24 గంటలకు రూ. 2 వసూలు చేస్తుండేవారు. అప్పటి నుంచి షెడ్ల నిర్వహణ అలా కొనసాగుతూనే ఉంది. అలా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులకు ఆ షెడ్లు అనుకూలంగా ఉండేవి. అయితే హఠాత్తుగా టౌన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పార్కింగ్ ఫీజు పెంపును తెరపైకి తెచ్చారు. ఇప్పటి వరకు నిర్వాసిత వికలాంగుల ఉపాధి కోసం ఏర్పాటైన ఈ షెడ్లను ఆ కేటగిరీ నుంచి తప్పించి ఓపెన్ కేటగిరీలోకి తెచ్చేశారు. టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పార్కింగ్ ఫీజును ఒకేసారి 10 రెట్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో 12 గంటలకు రూ. 10, 24 గంటలకు రూ. 20గా పార్కింగ్ ఫీజు నిర్ణయించింది. దీంతో కాంట్రాక్టర్లు పోటీ పడి టెండర్లు దక్కించుకున్నారు. మే 1 నుంచి కొత్త రేట్లను అమలు చేస్తున్నారు. దీంతో రోజూ పార్కింగ్ షెడ్ల వద్ద వాగ్వాదాలు జరుగుతూనే ఉన్నాయి.



పార్కింగ్ షెడ్ల బయట వాహనాలు

పెంపు ఉపసంహరించాలని వినతి..

ఉక్కు టౌన్ అడ్మిన్ నిర్ణయాన్ని ఉపసంహరించాలని 78వ వార్డు కార్పొరేటర్ జి. గంగారావు టౌన్ అడ్మిన్ యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. స్టీల్ సీఐటీయూ నాయకులు కూడా ఉక్కు డైరెక్టర్ (పర్సనల్)కు అందజేసిన వినతిపత్రంలో పార్కింగ్ చార్జీల పెంపును తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

యాజమాన్యానిది వ్యాపార ధోరణి..



ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉంటుందని యాజమాన్యాన్ని ఒప్పించి నాడు పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేశాం. ఇప్పటి యాజమాన్యం దాని ద్వారా వ్యాపారం చేయాలని చూడటం దుర్మార్గం. వెంటనే పెంచిన చార్జీలను ఉపసంహరించి, పాత ఫీజులను కొనసాగించాలి.
– జె. అయోధ్యరామ్, గౌరవాధ్యక్షులు, స్టీల్ సీఐటీయూ

క్లుప్తంగా

సేవలో సత్యసాయి భక్తులు



రైలు ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లు అందిస్తున్న సత్యసాయి భక్తులు

అగనంపూడి : స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల నేతృత్వంలో దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై జనరల్ బోగీ ప్రయాణికులకు మినరల్ వాటర్‌బాటిళ్ల పంపిణీ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ఉక్కునగర కమిటీ పాల్గొని సేవలు అందించింది. 9వ రోజు కార్యక్రమంలో బెంగళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్, దివ్యాంగులు, మహిళల బోగీల్లోని 5 వందల మందికి ఉచితంగా అరలీటర్ మంచినీటి వాటర్ బాటిళ్లను అందించారు. కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్.మూర్తి, కంచుమూర్తి ఈశ్వర్, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు జీ.రామకృష్ణ, ఎస్‌కెఆర్‌కె రాజు, కర్రి శ్రీనివాసరావు, సన్యాసిరాజు, పైడినాయుడు పాల్గొన్నారు.

లంకెలపాలెం వరకు మెట్రోరైలును పొడిగించాలి



గండి బాబ్జీకి వినతిపత్రం అందిస్తున్న 85వ వార్డు నాయకులు

అగనంపూడి: విశాఖ నగరం, గాజువాక పారిశ్రామిక ప్రాంతాల నుంచి రాంకీ ఫార్మాసిటీకి నిత్యం వేలాది మంది ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారని, అలాగే హోమీబాబా కేన్సర్ ఆస్పత్రికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది వచ్చి వెళ్తున్నారని, వీరి సౌలభ్యం కోసం మెట్రోరైలు ప్రతిపాదనను లంకెలపాలెం వరకు పొడిగించాలని ఏపీ ఆయిల్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీని 85వ వార్డు నాయకులు వినతిపత్రంలో కోరారు. కూర్మన్నపాలెం వరకు మాత్రమే ప్రతిపాదనలు చేశారని, వాటిని లంకెలపాలెం వరకు పొడిగించాలని నాయకులు బి.సత్యనారాయణ, ఈ. గౌరునాయుడు, బి.చందు, ఎస్.రంగారావు తదితరులు కోరారు.

ఉత్సాహంగా పాటల పోటీలు



పాటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు గురువారం పాటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



మహాసభల గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

ఉక్కునగరం: సీపీఎం జిల్లా మహాసభల గోడపత్రికను గురువారం స్టీల్‌ప్లాంట్‌లో ఆవిష్కరించారు. పార్టీ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు తాండ్ర కనకరాజు, ఎల్లేటి శ్రీనివాస్, జి. ఆనంద్ మాట్లాడుతూ విశాఖలో ఈనెల 10,11 తేదీల్లో సీపీఐ జిల్లా 25వ మహాసభలు జరగనున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కార్మిక చట్టాల మార్పును ఉపసంహరించుకోవాలన్నది సీపీఐ విధానమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మహాసభల్లో తీర్మానం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ నాయకులు కె.ఎస్.ఎన్. రావు, డొక్కా నర్సింగరావు, జి. జయ, డి.వి. నాగబాబు, బి.ఎం.ఎల్. నాయుడు, డి. దేముడు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గురుమూర్తిరెడ్డికి సత్కారం



గురుమూర్తిరెడ్డిని సత్కరిస్తున్న గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు

పెదగంట్యాడ: రాజమండ్రి నియోజకవర్గ పరిశీలకునిగా నియమితులైన తిప్పల గురుమూర్తిరెడ్డికి గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, మహేశ్వరరెడ్డి, రోజారాణి, కొయ్య భారతి, ఈశ్వరరావు, అప్పారావు, పిట్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

సోలార్ దీపాల ఏర్పాటు



దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి విజ్ఞాన్ కళాశాల వరకు ఏర్పాటు చేసిన సోలార్ దీపాలు

అగనంపూడి: ఎట్టకేలకు రైల్వే అధికారులు స్పందించి సోలార్ విద్యుత్ దీపాలు అమర్చారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు రహదారి నుంచి విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల వరకు రహదారి ధ్వంసం కావడంతో పాటు వీధి దీపాలు లేకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం ప్రజా సంఘాలు పలుమార్లు రైల్వే ఉన్నతాధికారులకు వినతుల ద్వారా విన్నవించుకున్నారు. ఈ క్రమంలో స్పందించిన అధికారులు 53 సోలార్ విద్యుత్ దీపాలను ఈ మార్గంలో ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు అధికారులు స్పందించడంతో దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సోలార్ దీపాలు అమర్చడంలో కృషి చేసిన సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి, డి.వి.మూర్తి, ఇతర అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక: పాకిస్తాన్‌పై భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌పై గాజువాక బీజేపీ నాయకులు గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాతగాజువాక జంక్షన్‌లో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలను కోల్పోయారని, ఉగ్రవాదులను అంతమొందించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత సైన్యం దాడులు జరిపి తొమ్మిది ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడం అభినందనీయమన్నారు. ఈ ఆపరేషన్‌కు ఇద్దరు మహిళలు నాయకత్వం వహించడం విశేషమని, ఇది దేశ చరిత్రలోనే మొదటిసారని అన్నారు. భారతదేశ జనాభా మొత్తం ప్రధాని మోదీ, భారత సైన్యం వెన్నంటి ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీనివాస్, కృష్ణంరాజు, శంకరరావు, ఎల్లాజీరావు, రోహిణి, పావని, అనిత, మాజీ సైనికులు రౌతు గోవింద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

25 శాతం ఉచిత అడ్మిషన్లు అమలు చేయాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయ భాస్కర్

గాజువాక: నూతన విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రతి పాఠశాలలో 25 శాతం ఉచిత అడ్మిషన్లను అమలు చేయాల్సిందేనని పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు బి.విజయ భాస్కర్ అన్నారు. ఉచిత అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ, బాధ్యతలు అంశంపై స్కూల్స్ కరస్పాండెంట్లతో గాజువాకలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దీంతో పాటు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఫారం ఒకటి ద్వారా ప్రతి పాఠశాలకు చెందిన పూర్తి వివరాలను ఆన్‌లైన్ ద్వారా సకాలంలో అందించాలన్నారు. మార్కులు, ఫీజుల చెల్లింపు ఆధారంగా విద్యార్థులపై వివక్ష చూపొద్దని, అందర్నీ సమానంగా చూడాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ప్రైవేట్ స్కూల్స్ కూడా భాగమేనని, అందువల్ల ప్రభుత్వం సూచించిన ప్రతి విషయాన్ని తప్పకుండా అమలు చేయాలని అన్నారు. పాఠశాలల నిర్వహణలో ప్రధానమైన రికార్డుల నిర్వహణను సక్రమంగా చూసుకోవాలన్నారు. విద్యార్థుల పూర్తి వివరాలు, మార్కులు తదితర సమాచారాన్ని ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా సకాలంలో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు, గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, రమణాజీ, జిప్సా నాయకులు పి.భాస్కరరావు, బి.శ్రీనివాసరావు, ఎం.బాబూరావు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం: ఈ నెల 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ జోన్ కమిటీలు పిలుపునిచ్చాయి. మద్దిలపాలెం కార్యాలయంలో గురువారం సమ్మె పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.వెంకటరావు, డి.అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇవి అమలైతే కార్మిక వర్గం అనేక హక్కులను కోల్పోతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు నరేంద్రకుమార్, రాజ్‌కుమార్, ఐసీ నాయుడు, ఎ.సింహాచలం, లక్ష్మణరావు, వెంకటరమణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో గ్రంథాలయాల అభివృద్ధి



ఏయూ లైబ్రరీ అధికారులు, సిబ్బందితో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ వెంకటేశ్వరరావు

విశాఖ విద్య: భావితరాలకు ఉపయోగపడేలా గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ వీఎస్ కృష్ణా లైబ్రరీని గురువారం ఆయన సందర్శించారు. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు. తాళపత్ర గ్రంథాలను పరిశీలించి, భావితరాలకు చరిత్ర తెలిసేలా వీటిని భద్రపరచడం అభినందనీయమన్నారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఇంకా ఏమైనా వసతులు కల్పించాలనే దానిపై లైబ్రరీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విశాఖ నగర గ్రంథ పాఠకులతోపాటు ఏయూ క్యాంపస్ కాలేజీల విద్యార్థులకు డాక్టర్ వీఎస్ కృష్ణా లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలు ఎంతో సౌలభ్యంగా ఉన్నాయని చైర్మన్ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. పోటీ పరీక్షార్థుల కోసం ఏర్పాటు చేసిన స్టడీ హాల్, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనా మహోత్సవం



తిప్పల దేవన్‌రెడ్డిని సత్కరిస్తున్న వినాయక మందిర కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: కాపు జగ్గరాజుపేట ఎస్టీబీఎల్ వైష్ణవి గార్డెన్స్‌లో వినాయక మందిర కమిటీ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త తిప్పల దేవన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు దేవన్ రెడ్డిని శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.

గాజువాక మార్కెట్‌లో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

గాజువాక: హోల్‌సేల్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త గాజువాక మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాల ఏర్పాటుకు వివిధ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మార్కెట్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయడంపై వర్తకులను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు, ప్రతినిధులు విల్లూరి శ్రీనివాస్, మద్దాల రామారావు, జయంతి సత్యనారాయణ, కె.తాతాబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: శ్రీనగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్‌కు ఈనెల 9న మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా శ్రీనగర్, అఫీషియల్ కాలనీ 1, 2, 3 ప్రాంతాలు, రాఘవేంద్ర స్కూల్ ఏరియా, శ్రీరామ్‌నగర్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట అవసరం

సీతంపేట: ధార్మిక సంఘాల ఐక్యతతో బాల్య వివాహ రహిత విశాఖ జిల్లా సాధ్యమని మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ శంసున్నీషా బేగం అన్నారు. అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ 'యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్' అనే ప్రాజెక్టులో భాగంగా అన్ని వర్గాల ధార్మిక సంఘ నాయకులకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధంలో ధార్మిక సంఘాలు ముఖ్య పాత్ర పోషించాలని కోరారు. మైనారిటీ సంక్షేమ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తెలియచెప్పడం ఎంత అవసరమో తెలిసిందన్నారు. రెవరెండ్ సూర్యకిరణ్, చక్రవర్తి, కె.వై.రత్నం పాల్గొన్నారు.

అక్రమ సోదాలు సరికాదు



గాజువాక తహసీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

- సాక్షి ఎడిటర్ ఇంట్లో తనిఖీలపై నిరసన
- తహసీల్దార్‌కు జర్నలిస్టు సంఘాల వినతి

గాజువాక: సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసుల అక్రమ సోదాలను ఖండిస్తున్నామని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లికి గురువారం వినతిపత్రం సమర్పించారు. సాక్షాత్తు సాక్షి దినపత్రిక ఎడిటర్ ఇంట్లో పోలీసులు అక్రమంగా సోదాలు నిర్వహించడం దారుణమని, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఒక ప్రముఖ పత్రిక ఎడిటర్‌తో దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని సాక్షి వెలుగులోకి తీసుకొస్తుందన్న అక్కసు, కక్షతో పోలీసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ చర్యలకు దిగినట్టుగా ఉందని పాత్రికేయ సంఘాలు ఆరోపించాయి. ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా అభివర్ణించాయి. ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలు సరికాదని ఈ సందర్భంగా నాయకులు హితవు పలికారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కె.రాము, ఏపీడబ్ల్యూజేఎఫ్ గాజువాక అధ్యక్షుడు పితాని సూర్యప్రసాద్, ఏపీడబ్ల్యూజే గాజువాక అధ్యక్షుడు కొయిలాడ పరశురామ్, యూనియన్ల నాయకులు కె.సూర్యప్రసాద్, బద్ది శిరీష, జి.రాంబాబు, గిరిబాబు, కిరణ్, జె.సుధాకర్, రాజు, రమణ, శివ, మూర్తి, సాక్షి ప్రతినిధులు కె.ప్రదీప్ నాయుడు, ఎం.శ్రీనివాస్, జి.ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి యువకుడు మృతి



ఏఎస్ స్టీల్ ట్రేడర్స్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

పెదగంట్యాడ: మండలంలోని కొంగపాలెం సమీపంలో తాటిచెట్టు పైనుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం శివరాజుపేట గ్రామానికి చెందిన పినిశెట్టి గణేష్ (22) పెదగంట్యాడ ఆటోనగర్‌లోని ఏఎస్ స్టీల్ ట్రేడర్స్ కంపెనీలో హైడ్రా హెల్పర్‌గా ఐదు నెలల నుంచి పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో అక్కడున్న తాటిచెట్టు ఎక్కి పట్టు తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మృతుని బంధువులు మాకు న్యాయం చేయాలంటూ యువకుడు పని చేస్తున్న ఏఎస్ స్టీల్ ట్రేడర్స్ కంపెనీ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకి దిగారు. దీంతో న్యూపోర్టు పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.